



జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి

- ఏమి చేసాడని 'మన భవిష్యత్'
- ఇంటి వద్దకు స్టిక్కర్లు తెచ్చేవారిని నిలదీయం
- యువగళంలో లోకేష్
- 800 కిలో మీటర్లకు పాదయాత్ర



యువగళం పాదయాత్రలో పాల్గొన్న మామా అల్లుళ్లు నందమూరి బాలకృష్ణ, నారా లోకేష్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అధోగతి పాలైందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. 63వ రోజు యువగళం పాదయాత్ర శుక్రవారం ఉదయం అనంతపురం జిల్లా శింగనమల నియోజకర్గం మర్తాడులో ప్రారంభం అయ్యింది. బూదేడు మీదుగా గార్లదిన్నె నుంచి రాత్రికి జంబులదిన్నెకి చేరుకుంది. శుక్రవారం నాటితో లోకేష్ పాదయాత్ర 800 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ శుక్రవారం జరిగిన పాదయాత్రలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈయనతో పాటు మాజీ హోం మంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప, కర్నూలు నాయకురాలు కోట్ల సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాదయాత్రలో 'గంజాయి వద్దు బ్రో' అన్న నినాదంతోనున్న క్యాప్‌ను తలకు ధరించి లోకేష్ పాల్గొన్నారు. మత్తు పదార్థాలు వినియోగించి యువత ఆరోగ్యాలు పాడుచేసుకుంటున్నారు... వీటని వాడొద్దంటూ తన ప్రసంగాల్లోనూ ప్రస్తావించారు. అనంతరం జరిగిన బహిరంగ సభల్లో వైసిపి చేపడుతున్న మూడు ప్రధాన కార్యక్రమాలపై లోకేష్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అన్ని రంగాల్లో వెనక్కు వెళ్లిందన్నారు. ఈ పరిస్థితుల్లో గొప్పలు చెప్పుకునేందుకు నువ్వే మా నమ్మకం జగన్ అంటూ ప్రజలను మోసం చేసే కార్యక్రమానికి వైసిపి నేతలు శ్రీకారం చుట్టారన్నారు. వాలంటీర్లు ఇళ్ల వద్దకు ఈ స్టిక్కర్లు తీసుకురాగాన రాష్ట్రానికి ఏమి చేశారని ప్రజలు నిలదీయాలన్నారు. తలుపునకు అతికించిన స్టిక్కర్లను పీకి వారికి వెనక్కు ఇవ్వాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని సొంత తల్లి, చెల్లియే నమ్మడం లేదని, ఇక ప్రజలు ఎలా నమ్ముతారన్నారు. 'నువ్వే భవిష్యత్' అంటూ మరో కార్యక్రమాన్ని వైసిపి చేపడుతోందన్నారు. రాష్ట్రాన్ని అధోగతిపాలు జేసిన వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఏ రకంగా మన భవిష్యత్ అవుతాడని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలి ప్రకటించిన లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే అతి తక్కువ ఐటి ఎగుమతులు చేస్తున్న రాష్ట్రమని చెప్పారు. వైసిపి చెపట్టిన మరో కార్యక్రమం 'జగన్‌కు చెబుదాం' అన్నది అని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డికి ఏమని చెప్పాలి... బాబాయి వివేకానందరెడ్డిని ఎవరు చంపారని చెప్పాలా... కోడికత్తి దాడి ఎవరు చేయించారో చెప్పాలా... అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి ఇప్పటికే భవయం పట్టుకుందని చెప్పారు. మొన్న జరిగిన నాలుగు మండలి ఎన్నికల్లోనూ ప్రజలు నాలుగు మొట్టికాయలు వేసారని చెప్పారు. ఆయన ఎన్నిక కార్యక్రమాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు, శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణి, టూమెన్ కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముట్టిమడుగు కేశవరెడ్డి, దండు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



యువగళం పాదయాత్రలో గంజాయి వద్దు బ్రో పోస్టర్లను విడుదల చేస్తున్న నారా లోకేష్

వివాదాల్లో 'పోలీస్'..!

- మడకశిరలో తరచూ విఆర్‌కు వెళ్తున్న పోలీస్ బాస్‌లు
- అవినీతి, ప్రయివేటు పంచాయితీలే కారణం..?

ప్రజాశక్తి-మడకశిర

కొందరు పోలీసులు చట్టం పరిధిని దాటి శాంతిభద్రతలకు తిలోదకాలిస్తూ, సొంత వ్యాపకాలతో ఇబ్బందులు కొని తెచ్చుకుంటున్నారు. మడకశిర ప్రాంతంలో ఇలా కొందరు పోలీసులు అవినీతి ఆరోపణల కేసులో విఆర్‌ఎలకు వెళ్తున్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల్లో ఆరుగురు ఎస్ఐలు, సిఐలు ఇలా అవినీతి ఆరోపణలతో విఆర్‌కు వెళ్లారు. మడకశిర ప్రాంతం జిల్లాకు సుదూరంగా ఉండడంతో ఇక్కడ ఏ శాఖకైనా అధికారులైనా శిక్షకు గురై ఇక్కడికి బదిలీపై వస్తుంటారు. అలా వచ్చిన అధికారులు సైతం ఇక్కడికి రాగానే మళ్లీ అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం గమనార్హం. ముఖ్యంగా పోలీసు శాఖలో ఈ పరిస్థితి మరింత ఎక్కువ కన్పిస్తోంది. తాజాగా ఎస్ఐ నాగేంద్రుడు పలు ఆరోపణలుతో విఆర్‌కు వెళ్లారు. సదరు ఎస్ఐ విధుల్లో చేరిన తొలిరోజుల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గట్టిగానే ఆదేశాలు ఇచ్చారు. రోజుల గడిచే కొద్దీ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. మడకశిర, పరిసర ప్రాంతాల్లో మట్కా, పేకాట నిర్వహణ, కర్నాటక మద్యం విక్రయాలు కొనసాగాయి. సదరు పోలీసు అధికారికి తెలిసే ఇవన్నీ జరుగుతూ వచ్చాయనే విమర్శలు విన్పించాయి. పేకాట జూదరులను అరెస్టు చేసే సమయంలో సైతం దొరికన డబ్బును చూపకుండా ఎక్కువ మొత్తం జేబులో వేసుకుని, నామమాత్రపు డబ్బు రికవరీ చేసినట్లు తెలుస్తోంది. ఇది ప్రతి నిత్యం కొనసాగుతూ వచ్చింది. మడకశిర పట్టణం మీదుగా రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలకు వెళ్తున్న ప్రయివటు బస్సులు దాదాపు 40 వరకు ఉంటాయి. వీటిని ప్రతి నెలా పోలీసు శాఖ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటుక బట్టీల నిర్వాహకులతో సైతం ఏదో ఒక నెపంతో వారి నుంచి కూడా ప్రతి నెలా రూ.4 నుంచి రూ.10వేల వరకు వసూలు చేసినట్లు వినికిడి. ఇక భూ వివాదాల్లో అయితే ఆ స్థలం ధరను బట్టి పెద్ద మొత్తంలోనే తీసుకున్నట్లు సమాచారం. భార్యాభర్తలు, అన్నాదమ్ముల గొడవులు లాంటి వాటిలోనూ పోలీసులు తలదూర్చి ప్రయివేటు పంచాయతీలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల పరిగి నుంచి టిడిపి కార్యకర్తలను ఓ కేసు విషయంలో విచారణ నిమిత్తం మడకశిర పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. సాధారణ విచారణ నిమిత్తం తీసుకొచ్చిన వారి నుంచి కూడా భోజనాల ఖర్చు పేరుతో రూ.8 వేలు నొక్కేసినట్లు తెలుస్తోంది. సాధారణ విచారణ నిమిత్తం తీసుకొచ్చిన వారి నుంచి కూడా ఇలా డబ్బులు వసూలు చేసున్నారంటే, ఇక నేరాలకు పాల్పడినా, అనుమానితులుగా ఉన్నా వారిని తీసుకొచ్చిన స్టేషన్‌లో వసూళ్ల స్థాయి ఏ రంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మడకశిర పోలీసు స్టేషన్‌లో కొందరు నిజాయితీగా పని చేయాలనుకున్న వారికి అవినీతి అధికారులు కావాలనే అడ్డంకులు సృష్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నారనే వాదన అక్కడ పని చేసి వెళ్లిన వారు చెబుతుంటారు. ప్రజలకు చేరువగా ఉండీ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాల్సిన పోలీసులు ఇలా అవినీతి మరక వేసుకుని విఆర్‌కు వెళుండడంపై ప్రజల్లో ఆ శాఖపై రోజురోజుకు అభిమానం సన్నగిల్లుతోంది. ఇప్పటికైనా పోలీసులు అవినీతి మాటను పక్కన బెట్టి నిక్కచ్చిగా విధులు నిర్వహించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని ప్రజలు కోరుతున్నారు.

అందరికీ ఆరోగ్యం నినాదంతో పనిచేయాలి

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజలందరి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, అందిరికీ ఆరోగ్యం అనే నినాదంతో పని చేద్దామని పలు ప్రజా సంఘాల నేతలు అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజారోగ్య వేదిక, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ, ఆంధ్రప్రదేశ్ మెడికల్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆవరణంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర నాయకులు ఎజి.రాజమోహన్, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, ఐఎంఎ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు డాక్టర్ హేమలత తదితరులు హాజరై మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది అందరికీ ఆరోగ్యం నినాదంతో ప్రభుత్వాలు, వైద్యులు, మనమందరం పని చేయాలన్నారు. ఆరోగ్యం ప్రజల హక్కుగా బడ్జెట్‌లో ఆరోగ్యంపై 5 శాతం నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ రంగ మందుల కంపెనీలను పునరుద్ధరించాలన్నారు. మందులు, వైద్య పరికరాలపై జిఎస్‌టి తీసివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి మెడికల్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్, ప్రజా పరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ, మెడికోలు, మెడికల్ రెప్రజెంటేటివ్‌లు తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అధికార, ప్రతిపక్ష నేతలు సవాళ్లు చేసుకోవడం సిగ్గుచేటు

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే.. అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు వారి అక్రమాలపై ఒకరిపై ఒకరు వ్యక్తిగత ఆరోపణలు, సవాళ్లు చేసుకోవడం సిగ్గుచేటని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మండిపడ్డారు. గుంతకల్లు పట్టణంలోని ప్రజా సమస్యలపై సిపిఎం నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం మూడవ రోజుకు చేరాయి. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ వారి దీక్షలకు మద్దతు తెలిపారు. మూడవ రోజు సిపిఎం అనుబంధ కెవిపిఎస్ నాయకులు రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వి.రాంభూపాల్ మాట్లాడుతూ ప్రజలను ఓటు బ్యాంకుగానే చూస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు వారి సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రజా ప్రతినిధులు, ప్రధాన నేతలు వారి వారి అవినీతి, అక్రమాలు, భూ కబ్జాలపై వ్యక్తిగత ఆరోపణలు, సవాళ్లు చేసుకోవడమే కాకుండా దేవుళ్లను కూడా వారి కుళ్లు రాజకీయాల్లోకి ఈడ్చడం సిగ్గుచేటన్నారు. గత కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు ప్రస్తుత అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు ఆదాయ వనరుగా మారాయన్నారు. ఆర్థిక స్థోమత లేక ఇంటి నిర్మాణం చేసుకోలేని పేదల స్థలాలను వైసిపి నాయకులు దర్జాగా కబ్జా చేసి అమ్ముకుంటూ రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అందుకు ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేలు వత్తాసు పలుకుతూ పేదలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కరోనా సాకుతో రెండేళ్లుగా శస్త్ర చికిత్స లు చేయడం లేదన్నారు. దీంతో గర్భిణులు కష్ట కాన్పులు ఉన్నపుడు ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి అప్పులు చేసి రూ.లక్షలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. గుంతకల్లు పట్టణ శివారు కాలనీల్లో ప్రజలకు తాగునీరు, రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని విమర్శించారు. జగనన్న లేఅవుట్లలో పేదలు నిర్మించుకుంటున్న ఇళ్లకు రూ.5 లక్షలు రుణం మంజూరు చేయాలన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని అందుకే ప్రజా ధనంతో మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం చేపట్టడం సిగ్గు చేటన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్ బిజెపిపై తన వైఖరి మార్చుకోవాలన్నారు. బిజెపిని రాష్ట్రంలోకి తెస్తే ప్రజల నెత్తిపై నిప్పుల కుంపటి పెట్టినట్లు అవుతుందన్నారు. స్థానిక ప్రజా సమస్యలను అధికార, ప్రతిపక్ష పార్టీలు విస్మరించినా ఎర్రజెండా పార్టీ సిపిఎం విస్మరించదని అన్నారు. అందుకే రిలే దీక్షలు చేపట్టామన్నారు. వైసిపి ప్రజా ప్రతినిధులు అవినీతి, అక్రమాలకు ముందుండి.. అభివృద్ధికి దూరంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమలు లేక అనేక మంది నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి జీవనాన్ని గడుపుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా నాయకులు కళ్లుతెరిచి ఈ ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం చేయాలని లేనిపక్షంలో రాయలసీమ వ్యాప్తంగా పాదయాత్ర చేస్తామని హెచ్చరించారు. మూడవ రోజున కెవిపిఎస్ నాయకులు జగ్గలి రమేష్, రాము నాయక్, సురేష్, మల్లి, సల్మాన్ రాజ్, రాము, కృష్ణ దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతి ప్రసాద్, కసాపురం రమేష్, ఐద్వా పట్టణ అధ్యక్షురాలు రంగమ్మ, అబ్దుల్లా, ఓబులేసు, షాషా, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

మాజీ ఎమ్మెల్యే విశ్వకు సన్మానం

ప్రజాశక్తి-ఉరవకొండ

'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని శుక్రవారం ఉరవకొండ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి ప్రారంభించేందుకు రావడంతో మేజర్ పంచాయతీ 15వ వార్డు సభ్యులు వశికేరి మల్లికార్జున ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉరవకొండ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో ఉరవకొండ నియోజకవర్గంలో విశ్వేశ్వరరెడ్డిని ఎమ్మెల్యేగా, జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రతి కార్యకర్తా సైనికుల్లా పనిచేస్తామని ఆయన తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు అందరూ కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ఉరవకొండ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించిన సంక్షేమ పథకాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐదవ సచివాలయ కన్వీనర్ జోగి విజయ్, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



విశ్వేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న వసికేరి మల్లికార్జున



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా సంగమేశ్వరుని రథోత్సవం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్ మండలంలోని త్రివేణి సంగమం వద్ద వెలసిన సంగమేశ్వర స్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. స్వామివారి ప్రతిమను రథోత్సవంపై ఆశీనం చేసి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. రథోత్సవం కార్యక్రమంలో రాయదుర్గం ఎమ్మెల్యే, విప్ కాపు రామచంద్రారెడ్డి దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. టిడిపి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, ఆయన తనయుడు కాలవ భరత్ పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా కర్నాటక రాష్ట్రం నుండి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి సామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. బొంబాయి ఈరన్న ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కృష్ణ, మాజీ సర్పంచులు దేవన్న, బడిగ ఆంజనేయులు, టిడిపి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలోనే అనంత అభివృద్ధి

మాజీ కార్పొరేటర్ విజయశ్రీరెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంత అభివృద్ధి ప్రదాత మాజీ శాసన సభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి అని తెలుగుదేశం మాజీ కార్పొరేటర్లు విజయశ్రీరెడ్డి కొనియాడారు. శుక్రవారం టిడిపి నియోజకవర్గం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్లు విజయశ్రీరెడ్డి, జానకి, సరళ, సరోజమ్మ, షరీనా తదితరులు హాజరై మాట్లాడుతూ...తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను విమర్శించే అర్హత వైసీపీకి లేదన్నారు. అనంత అభివృద్ధి పై చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. నగరంలో అభివృద్ధి జరిగిందంటే ఒక్క ప్రభాకర్ చౌదరి వల్లే అని పేర్కొన్నారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో నగర అభివృద్ధి కోసం ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలన్నారు. నగరంలో ఎక్కడ చూసినా గుంతలమయంగా రోడ్లు చెత్తా చెదారం, నిండి ఉందన్నారు. కనీసం రోడ్లు పూడ్చలేని మీరు నగరాభివృద్ధి ఎలా చేస్తారని ప్రశ్నించారు. మున్సిపల్ ఛైర్మన్‌గా ఎమ్మెల్యేగా ప్రభాకర్ చౌదరి చేసిన అభివృద్ధి నగరంలో ఉందని, మీరు చేసింది ఏదీ లేదని ఎద్దేవా చేశారు. మా ప్రభుత్వంలో మేము చేసిన అభివద్ధిపై చర్చకు సిద్ధమని మీరు సిద్ధమా అని సవాల్ విసిరారు. గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డ్ తొలగిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మరిచిపోయారని, సంవత్సరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ తీసుకొస్తానన్న ఎమ్మెల్యే ఇంత వరకు అతీగతి లేదన్నారు. టిడిపి హయాంలో 6 వేల టిడ్కో ఇళ్లు 90 శాతం పనులు పూర్తి చేసినా మిగతా పనులు పూర్తిచేసి ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందన్నారు. అభివృద్ధికి చిరునామా ప్రభాకర్ చౌదరి అని పేర్కొన్నారు.





అన్నదానం చేస్తున్న దృశ్యం

భక్తులకు అన్నదానం

ఉరవకొండ : కూడేరులో ప్రసిద్ధిగాంచిన జోడలింగాల సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా. శుక్రవారం పారువేట ఉత్సవం జరిగింది. రవికృప గ్రూప్ సంస్థల అధినేత వన్నూరప్ప, బట్టా జనార్దన్ నాయుడు, ఈశ్వరయ్యల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏటా. అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవికృప సంస్థల అధినేత పి.రామానాయుడు, కాంగ్రెస్ నాయకులు వడ్ల ఆంజనేయులు, కాంగ్రెస్ మండల కన్వీనర్ నారాయణస్వామి యాదవ్, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు వి.జానకమ్మ, నాయకులు పరంధామ, లక్ష్మన్న, చిరు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

యాడికి : వడ్డెర్ల సంఘం ఆధ్వర్యంలో దాత ముక్కల రామాంజనేయులు స్థానిక బస్టాండులోని గాంధీ విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండుతున్న ఎండల దృష్ట్యా ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వడ్డెర్లు పాల్గొన్నారు.

మడ్డిపల్లిలో క్రికెట్ టోర్నమెంట్

పుట్లూరు : మడ్డిపల్లి గ్రామంలో అంకాలమ్మ తల్లి వారోత్సవాల్లో భాగంగా శనివారం నుండి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మొరం ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేవారు ఎంట్రీ ఫీజు రూ.వెయ్యి చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. విన్నర్స్ జట్టుకు రూ.50 వేలు, రన్నర్స్ జట్టుకు రూ.25 వేలు నగదు బహుమతి అందజేస్తామని తెలియజేశారు.

'యువగళం'లో పుట్లూరు నాయకులు

పుట్లూరు : శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలంలో నారా లోకేష్ శుక్రవారం చేపట్టిన యువగళం పాదయాత్రలో పుట్లూరు మండలానికి చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు సంజీవపురం పవన్‌కుమార్‌రెడ్డి, కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, గోపరాజుపల్లి రవికుమార్‌రెడ్డి, బాలాపురం రామచంద్రారెడ్డి, కడవకల్లు గోవర్ధన్ రాజు, ఎల్‌కె.చెన్నారెడ్డి మడ్డిపల్లి శివారెడ్డి తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే

పుట్లూరు : గుడ్ ఫ్రై డేని పురస్కరించుకుని మండలంలోని చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పుట్లూరు మండల కేంద్రంలోని చర్చిలో ఫాదర్ ప్రభుదాసు ఆధ్వర్యంలో ఏడు మాటలు సిలువ ధ్యానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్స్, క్రిస్టియన్స్ పాల్గొన్నారు.

ఆరు దశాబ్దాల నమ్మకంతో వ్యాపారం..

పాలు, పాల ఉత్పత్తులకు కేరాఫ్ ముత్యాలరెడ్డి మిల్క్ డెయిరీ
అధినేత ముడియం రాజశేఖర్ రెడ్డి



ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం ఉభయ జిల్లాలో పాలు, పాల పదార్థాలు అనగానే ముందుగా గుర్తుకు వచ్చే సంస్థ ముత్యాలరెడ్డి మిల్క్ డెయిరీ అందుకే ఎన్నో కార్పొరేట్ కంపెనీలు పాలు, పాల పదార్థాలను అందిస్తున్నా ప్రాంతీయ అభిమానంతో నాణ్యత, నమ్మకానికి పెద్దపీట వేసి అనంతపురం జిల్లా వాసులు ఆ సంస్థను ఆదరిస్తున్నారు. ప్రజల నమ్మకాన్ని, ఆదరణను వమ్ము చేయకుండా తండ్రి బాటలో నాణ్యతకు పెద్దపీట వేస్తున్నట్లు ఆ సంస్థ అధినేత, వ్యవస్థాపకులు ముత్యాలరెడ్డి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో తన అనుభవాలను పంచుకున్నారు. 1960లో ప్రారంభమైన తమ ప్రయాణం నేటికీ ప్రజల మనసులో అదే స్థాయి ముద్రను వేసుకుందని తెలిపారు. తండ్రి ముత్యాలరెడ్డి చూపిన మార్గంలో తాము ప్రజల ఆదరణను పొందుతున్నామన్నారు. పాల ఉత్పత్తుల వ్యాపారంలో నాణ్యత, నమ్మకానికి నిదర్శనంగా ఉంటూ వ్యాపారం కొనసాగిస్తున్నామని చెప్పారు. ముత్యాలరెడ్డి కుటుంబం పాల వ్యాపారానికి కేరాఫ్‌గా నిలిచిందన్నారు. అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూ పలు ఆటంకాలను సైతం లెక్కచేయక నాణ్యమైన ఉత్పత్తులను ప్రజలకు అందించడమే ధ్యేయంగా తమ సంస్థ ముందుకెళ్తోందన్నారు. ప్రస్తుతం తమ ఆధ్వర్యంలో గత ఆరు సంవత్సరాలుగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఒక బ్రాంచ్ నడుస్తోందన్నారు. ఇటీవల కాలంలో గుత్తి రోడ్డులో మరొక బ్రాంచ్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు చేరువ అయినట్లు తెలిపారు. వ్యాపారంతో పాటు ప్రధానంగా తాము పలువురికి ఉపాధి కల్పించడం ఆత్మ సంతృప్తిని కలిగిస్తోందని అన్నారు. ప్రతిరోజూ జిల్లా రైతుల నుంచి సుమారు రెండు వేల లీటర్ల పైచిలుకు పాలను సేకరించి తమవంతుగా చేయూతనిస్తున్నట్లు తెలిపారు. వ్యాపారంతో పాటు తమవంతు సహాయ సహకారాలు సమాజానికి అందించాలన్న ఉద్దేశంతో తమ తండ్రి ఆశయంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. కరోనా వారియర్లకు తమ వంతు సహకారం అందించినట్లు తెలిపారు. ఇదే క్రమంలో పలు సహాయ సహకారాలు అందిస్తున్న ఆర్‌డిటి సంస్థకు రూ.75 వేలు విరాళం అందించినట్లు చెప్పారు. ఇంకా పలు సేవా, స్వచ్ఛంద కార్యక్రమాలకు సహకారం అందిస్తూ ముత్యాలరెడ్డి సంస్థ ముందుకెళ్తోందని తెలియజేశారు. తమ వద్ద పాలతో చేసే పాలకోవా, కలాకండ్, బాసంతి పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, పన్నీర్, రోజ్ మిల్క్, బట్టర్ మిల్క్, బాదంపాలు వంటి అనేక రకాల పాల ఉత్పత్తులు లభిస్తాయని తెలిపారు. ప్రజల ఆదరణతో భవిష్యత్తులో మరిన్ని బ్రాంచ్‌లను ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. అయితే ప్రధానంగా నాణ్యతకు పెద్దపీట వేస్తున్నట్లు వెల్లడించారు.



అనంత నగరంలోని ముత్యాలరెడ్డి మిల్క్ డెయిరీ

ప్రతి లబ్ధిదారునితో మమేకమవుతాం

ఈ నెల 20 వరకు డోర్ టు డోర్ క్యాంపెయిన్
'జగనన్నే మా భవిష్యత్'లో వైసిపి ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారునితో మమేకమవుతామని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో సంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. అందుకే 'జగనన్నే మా భవిష్యత్' అని జనం అంటున్నారని చెప్పారు. శుక్రవారం నగరంలోని నవోదయ కాలనీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి పలు కుటుంబాలను నేరుగా కలిశారు. చంద్రబాబు పాలనకు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తేడాను వివరించి ప్రజల మద్దతు కోరారు. భవిష్యత్‌లోనూ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా ఉంటారా? సంక్షేమ పథకాలు అందుతున్న తీరు బాగుందా? ఇంకా ఏమైనా మార్పు చేయాలా? అని ప్రజల అభిప్రాయం తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 60 లక్షల కుటుంబాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పార్టీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు కలవడమే లక్ష్యంగా 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ఈనెల 20వ తేదీ వరకు దాదాపు 14 రోజులు ప్రజలతో మమేకమవుతామన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నాలుగేళ్లలో రూ.2 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారులకు అందజేసిన ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించలేదని చెప్పారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి క్లస్టర్ పరిధిలో రోజూ 10 నుంచి 15 కుటుంబాలను కలిసి ప్రజామద్దతు కోరనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ప్రజల సమ్మతితో ప్రతి ఇంటికీ స్టిక్కర్లు అందిస్తామన్నారు. వైసీపి జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య మాట్లాడుతూ పేదలకు ఏదైనా మంచి జరిగిందంటే అది జగన్ సీఎం అయిన తర్వాతేనని చెప్పారు. భవిష్యత్తులో ఇంకా మంచి జరగాలంటే వైసిపితోనే సాధ్యమన్నారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఉరవకొండ : సంక్షేమం పథకాలు ప్రజలకు అందించడం ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించవచ్చన్న దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సిఎం జగన్ పాలనపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు 'జగనన్నే మా భవిషత్' అనే నినాదంతో కొత్త కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభించారు. ఉరవకొండ, విడపనకల్లు మండల కేంద్రాల్లో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, కూడేరు మండల కేంద్రంలో యువనేత వై.ప్రణయ్‌రెడ్డి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గత చంద్రబాబు ప్రభుత్వానికి ప్రస్తుత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మధ్య తేడాను వివరిస్తూ మరోసారి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో విడపనకల్, ఉరవకొండ జెసిఎస్ మండల కన్వీనర్లు భరత్‌రెడ్డి, తేజోనాథ్, ఆసిఫ్, విడపనకల్ ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు, పిఎసిఎస్ చైర్మన్ శ్రీరాములు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రమేష్, సర్పంచి రామాంజనేయులురెడ్డి, నాయకులు కరణం భీమిరెడ్డి, సుంకన్న, దేశాయి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : వైసిపి ప్రభుత్వం గత నాలుగేళ్లుగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను, ప్రభుత్వ పాలన పనితీరు వివరించేందుకే వార్డు వాలంటీర్లు, గృహసారథులు ప్రజల్లోకి వెళ్తున్నట్లు ఎమ్మెల్యే విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని 16వ ఎన్నికల వార్డు ప్రభుత్వ బాలికల వసతి గృహం వద్ద నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ అభివద్ధి పథకాల లబ్ధిని కరపత్రాల రూపంలో పంపిణీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కార్యక్రమంలో పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, వలీ బాషా, మున్సిపల్ వార్డు సభ్యులు డిష్ గోవింద, శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు గౌని లక్ష్మీకాంతరెడ్డి, పవన్‌కుమార్, నిజాం, ఆనంద్, గృహ సారథుల కన్వీనర్ బుజ్జి, వాలంటీర్లు, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


అనంతపురం కలెక్టరేట్ : రూరల్ మండలం పాపంపేటలో 'జగనన్నే మా భవిష్యత్తు', 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాలను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జిల్లా పరిషత్ ఛైర్మన్ బోయ గిరిజమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఇళ్లకు స్వయంగా స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, జెసిఎస్ ఇన్‌ఛార్జిలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, స్టోర్ డీలర్లు, మండల నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : గన్నెవారిపల్లె రెండవ సచివాలయం పరిధిలో ఎంపీటీసీ సగర రవికుమార్ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన స్టిక్కర్లు, కిట్లను పంపిణీ చేశారు. వైసిపి నాయకులు ప్రదీప్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి : ఎంపీపీ కమల, ఎనుములదొడ్డి పంచాయతీ సర్పంచి మహదేవమ్మ ఆధ్వర్యంలో మా భవిష్యత్తు నీవే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. జెడ్పిటిసి బి.రాధాస్వామి, వైస్ ఎంపీపీ సోమనాథ్, మండల సచివాలయ కన్వీనర్ రాము, వాల్మీకి డైరెక్టర్ కె.పాలాక్షి, విజయ్‌కుమార్, జంబుగుపాల సర్పంచి గంగాధర, మండల కన్వీనర్ తనయుడు ఆలూరు నరేష్, నాగరాజు, మర్రిస్వామి, మాజీ సర్పంచి లింగప్ప తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో..



పాపంపేటలో స్టిక్కర్లు అతికిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆరోపణలు చేయడానికే 'యువగళం'



మీడియాతో మాట్లాడుతున్న ప్రణయ్‌రెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

వైసిపి నాయకులపై తప్పుడు ఆరోపణలు చేయడానికే నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తనయుడు, పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన అనంతపురం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కూడేరు ప్రాంతంలో నారా లోకేష్ తనపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అనేక అవినీతి, అక్రమాలు చేసిన ఎమ్మెల్యే కేశవ్‌ను పక్కన పెట్టుకుని వేదాలు వల్లించడం విడ్డూరంగా ఉందన్నారు. ఏపీ ఫైబర్ నెట్‌లో స్కాం చేసింది చంద్రబాబు, లోకేషే అన్నారు. ఇలాంటి వాళ్ల అవినీతి, అక్రమాల గురించి మాట్లాడతారా అంటూ ధ్వజమెత్తారు. పాదయాత్ర అంటే ప్రజల కష్టాలు తెలుసుకోవడానికి చేపట్టాలని, వైసిపి ఎమ్మెల్యేలను, నాయకులను విమర్శించేందుకే లోకేష్ యాత్ర చేస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న జగన్మోహన్‌రెడ్డిని ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదని హెచ్చరించారు. చంద్రబాబు గత ఎన్నికల్లో ఇంటింటికీ జాబ్ ఇస్తానని చెప్పారన్నారు. ఒక్క జాబ్ అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. వైసిపి నాయకుల పై విమర్శలు చేయడం మాని ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు పాదయాత్ర చేయాలని హితవుపలికారు. టిడిపి నాయకులు ఎన్ని యాత్రలు చేసినా ప్రజలు జగన్ వైపే ఉన్నారన్నారు. టిడిపి నాయకులు చేసే తప్పుడు ఆరోపణలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణ స్వీకారం చేస్తారని జోష్యం చెప్పారు.

గతంలో కంటే ఘనంగా బ్రహ్మోత్సవాలు

విప్ కాపు రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలను మే నెలలో గతంలో కంటే ఘనంగా జరుపుదామని ఎమ్మెల్యే, విప్ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై దేవాదాయ శాఖ సమూహ దేవాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణ అధికారి నరసింహారెడ్డి మాట్లాడుతూ మే నెల 3వ తేదీ నుండి 13వ తేదీ వరకు 11 రోజుల పాటు ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 8వ తేదీ కళ్యాణోత్సవం, 10వ తేదీ బ్రహ్మ రథోత్సవం జరుగుతుందన్నారు. విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈసారి బ్రహ్మోత్సవాలను గతంలో కంటే ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆలయం చుట్టూ నాలుగు వైపులా మాడా వీధుల నిర్మాణాన్ని పూర్తి చేయించాలని ఆలయ కమిటీ అధ్యక్షులు గౌని పాలాక్షిరెడ్డి, కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డిని కోరారు. స్వామివారి రథాన్ని నిలిపే షెడ్డు ముందుభాగాన పెయింటింగ్ వేయించాలని సూచించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో అన్ని సామాజిక వర్గాలకు చెందిన ప్రజలూ పాల్గొనేలా చూడాలన్నారు. 15వ తేదీన మరోసారి సమావేశం జరిపి ఉత్సవాల నిర్వహణ బాధ్యతల పంపిణీ చేపట్టాలని కోరారు. కల్యాణోత్సవాన్ని ప్రజలందరూ తిలకించేలా పట్టణ ప్రధాన వీధుల్లో టీవీ స్క్రీన్‌లు, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయాలన్నారు. గత ఏడాది జరిగిన రథోత్సవం సందర్భంగా ఆకతాయిలు విసిరిన రాళ్లు తమకు తగిలాయని మున్సిపల్ ఛైర్మన్ పొరాలు శిల్ప, విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. ఈసారి అలా జరగకుండా తగిన భద్రత ఏర్పాట్లు చేయాలని రూరల్ సిఐ యుగంధర్‌ను కోరారు. ఉత్సవాల సందర్భంగా పిక్ పాకెటింగ్ చోరీలు, జరగకుండా చూడాలన్నారు. బ్రహ్మోత్సవాలకు ఆధ్యాత్మికవేత్త గరికపాటి వారిని పిలవాలని మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఉపేంద్రరెడ్డి సూచించారు. ఈ సమావేశంలో ఆలయ పాలకమండలి సభ్యులు సత్యనారాయణ, పద్మశాలి సామాజిక వర్గం అధ్యక్షులు శివప్ప, వార్డు సభ్యులు లావణ్య, శ్రీలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, డిష్ గోవింద, గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసులు, జయంతి రామగోపాలకష్ణయ్య శెట్టి, పొరాల శివ కుమార్, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కోడూరు రవికుమార్, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు దేవిరెడ్డిపల్లి రాజేష్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-నల్లచెరువు

శ్రీ సత్యసాయి జిల్లా నల్లచెరువు మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... తనకల్లు మండలం కనసానివారిపల్లికి చెందిన చంద్రశేఖరరెడ్డి(45), శ్రీనివాసరెడ్డి(35)అనే వ్యక్తులు ఓ పని నిమిత్తం ద్విచక్రవాహనంలో కదిరికి బయల్దేరారు. కదిరికి వెళ్తుండగా మార్గమధ్యంలో నల్లచెరువు మండలం ఎర్రగుంటపల్లి వద్దకు రాగానే ముందు వెళ్తున్న బొలేరోజు ఓవర్‌టేక్ చేశారు. ఈ సమయంలో ఎదురుగా మదనపల్లి వైపు వెళ్తున్న కారు రావడంతో దానిని ఢీకొన్నారు. రెండు వాహనాలు వేగంగా ఎదురెదురుగా ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే ద్విచక్రవాహనంలో వెళ్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి మృతి చెందారు. ప్రమాదవిషయం తెలుసుకున్న కదిరి రూరల్ సిఐ శివశంకర్ నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కదిరికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

'అనంత'లో భారీ పేలుడు

తునాతునకలైన వ్యక్తి శరీర భాగాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన భారీ పేలుడు కలకలం రేపింది. రవాణా శాఖ కార్యాలయం సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో చాకలి సతీష్ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కెకె.అపార్టుమెంట్స్‌లో సతీష్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అపార్టుమెంటు యజమానులకు కెకె.పెయింటింగ్స్ అనే పెయింటింగు వ్యాపారమూ ఉంది. పెయింటింగుకు సంబంధించిన మెటీరియల్, ఇతర రసాయనాలు డ్రమ్ముల్లో చాలాకాలంగా నిలువ ఉన్నాయి. రసాయనాలు పడేసి డ్రమ్ములను గుజరీకి అమ్ముకోమని యజమానులు చెప్పడంతో, అందులోనున్న రసాయనాలు కిందపడేసేందుకు మూతలు తెరిచారు. ఆ సమయంలో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి సతీష్ 40 అడుగుల ఎత్తు ఎగిరి కిందపడ్డాడు. శరీర భాగాలు మొత్తం తునాతునకలై మాంసం ముద్దలాగా మారింది. మధ్యాహ్నం సమయంలో ఇంత పెద్దఎత్తున పేలుడు సంభవించడంతో ఏమి జరిగిందోనని ఆ ప్రాంతంలో భీతావాహ వాతావరణం ఏర్పడింది. ఘటన విషయం తెలియగానే వన్‌టౌన్ పోలీసులు, ఫైర్ సిబ్బందికి కూడా అక్కడికి చేరుకున్నారు. సిఐ రవిశంకర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.



పేలుడు సంభవించిన ప్రాంతం ఇదే..

బండి పరుశురాంను విడుదల చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు

బండి పరశురాంను విడుదల చేయాలని టిడిపి నాయకులు కృష్ణమోహన్ చౌదరి ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ.. విచారణ కోసమని పిలవడంతో బండి పరశురాం సిఐ మోహన్‌కు కలిశారన్నారు. సిఐ విచారణ చేసి వదిలిపెడతామని చెప్పి పరశురాంను అనంతపురానికి తరలించడం అన్యాయమన్నారు. పరశురాంను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శశంకర్ చౌదరి, రాందాస్, వెంకటనారాయణ, సుధాకర్ రెడ్డి, కొండారెడ్డి, బొమ్మయ్య, ముట్టాల నరసింహులు, కందల ఓబుళపతి, మంగళి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

జాగ్రత్తలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని విడపనకల్ ప్రభుత్వ వైద్యాధికారి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం విడపనకల్, పెద్దకొట్టాలపల్లి ప్రభుత్వ పిహెచ్‌సిల ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు శ్రీధర్ మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండడానికి తక్కువ మాంసాహారం, ఎక్కువ శాఖాహారం, తక్కువ చక్కెర, తక్కువ డ్రైవింగ్, ఎక్కువ కాలినడక, తక్కువ కోపం, ఎక్కువ ఆనందం లాంటి ఐదు సూత్రాలు పాటించాలన్నారు. అంతేకాకుండా ప్రతిరోజు ఉదయమే వాకింగ్ చేయడంతో పాటు యోగా, ధ్యానం లాంటి పద్ధతులు పాటిస్తే మానసికంగా ప్రశాంతంగా ఉండటమే కాకుండా దృఢంగా ఉంటారన్నారు. పొగాకు ఉత్పత్తులైన బీడీ, సిగరెట్, గుట్కాలు లాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ప్రమీలదేవి, వైద్య సిబ్బంది శర్మాస్‌వలి, మునెమ్మ, అంజినమ్మ, జయభారతి, నూర్ మహమ్మద్, నాగశంకర్, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వడ్డిపల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దయాకర్, సబిహా సుల్తానా, ఎంపిహెచ్ఇఒ నాగేశ్వరయ్య, సూపర్‌వైజర్ వెంకటరత్నమ్మ, ఎఎన్ఎం లక్ష్మీ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ తేజస్విని, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మండల వైద్యాధికారి నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మనోహర్ రెడ్డి, పర్యవేక్షకులు సుబ్బమ్మ, రవీంద్ర, నారాయణమ్మ, ఎల్టీ అనిల్ మధు బాబు ఫార్మసిస్ట్ సుబ్బలక్ష్మి, స్టాఫ్‌నర్స్ సుధా, సిబ్బంది సునీత, తిమ్మప్ప, ఆశాలు పాల్గొన్నారు.



ఉరవకొండలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం